క్లుప్తంగా

విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్..

భీమదేవరపల్లి : రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించేలా ఏర్పాట్లు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ శిరీష్‌కుమార్ తెలిపారు. 'ఎండుతున్న ఆశలు' శీర్షికతో అప్రకటిత విద్యుత్ కోతలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈ కొత్తపల్లి, భీమదేవరపల్లి తదితర గ్రామాల్లోని రైతుల వ్యవసాయ క్షేత్రాలను గురువారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. రోజూ 18 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వేళలను సైతం రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఆత్మకూరు : సీఎంఆర్‌ఎఫ్‌ను పేదలకు వరంగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అభివర్ణించారు. పరకాల, ఆత్మకూరు, దామెర, నడికుడ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన రూ.14.19 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను హనుమకొండలోని నివాసంలో గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని చెప్పారు. లక్షలాది మంది పేదలకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతోందని తెలిపారు. గత పాలకులు సీఎంఆర్‌ఎఫ్‌ను పేదల దాకా రానివ్వలేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని దామెర ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, బీఆర్‌ఎస్ పార్టీ దామెర మండల అధ్యక్షుడు గండు రాము, నాయకులు బొల్లెబోయిన రవియాదవ్, పుల్యాల రఘుపతిరెడ్డి, దామెరుప్పుల శంకర్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం



శాయంపేట : ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో తలపెట్టిన ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ సభకు మండల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గురువారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాహనాలను మనోహర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా మంత్రి కేటీఆర్ అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నిక



కమలాపూర్ : తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో 2023–26 వరకు కొనసాగనున్నారు. మోహన్ గతంలో రెండుసార్లు సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోహన్ ఎన్నికవడం పట్ల హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, నాయకులు ఎం.మల్లారెడ్డి, సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, నయీమొద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

'రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం'



ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు భృతి, తదితర వాగ్దానాలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, వెల్దె సదానందం పాల్గొన్నారు.

గట్టు మల్లన్నకు నిత్య జాతర

- భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులో ఉన్న గుట్టపై నిత్య జాతర సాగుతోంది. ఆ గుట్టపై వెలసిన శ్రీ గట్టు మల్లికార్జునస్వామి మహిమ గల దేవుడని ప్రతీతి. గుట్ట మీదున్న ధర్మగుండంలో స్నానాలు ఆచరించి అందులోని నీటిని పంట పొలాల్లో, పాడి పశువులపై చల్లితే మేలు జరుగుతుందని ప్రజల ప్రగాఢ నమ్మకం. పూర్వం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన ఏసబోయిన కొంరయ్య గొర్రెలను మేపడానికి అడవిలోకి వెళ్లగా ఒక్కసారిగా గొర్రెలు మాయమైపోగా వెతికి వెతికి అలసిపోయిన కొంరయ్య ఓ చెట్టు కింద సేద తీరుతుండగా ఆయన కలలోకి మల్లికార్జునస్వామి వచ్చి గుట్టపైకి వెళ్లి చూడాలని ఆజ్ఞాపించినట్టు ఏసబోయిన వంశీయుల ద్వారా తెలుస్తోంది. దుద్దిళ్ల పొగ వచ్చే చోట తాను నెలువై ఉన్నట్టు, ఆ చోటనే అనేక మంది దేవుళ్ల ప్రతిమలు కనిపిస్తాయని దేవుడు చెప్పినట్టు సమాచారం. కాగా యాదవులు మల్లికుదుర్ల గ్రామ శివారులో అడవిలోని గుట్టపైకి వెళ్లి చూడగా పెద్ద బండరాళ్ల మధ్యలో ఉన్న ఒక పుట్టలో నుంచి దుద్దిళ్ల పొగ రాగా అందులో గట్టు మల్లికార్జునస్వామి, ఇతర దేవుళ్ల ప్రతిమలు కనిపించినట్టు చెబుతారు. దీంతో యాదవ కుటుంబాలు ఆ దేవుళ్లను పూజించి తిరిగి వస్తున్న సమయంలో మాయమైన గొర్రెలు యాదవులకు ఎదురు పడ్డట్టు ప్రచారంలో ఉంది. నాటి నుంచి యాదవులు గట్టు మల్లికార్జునస్వామిని కులదైవంగా పూజిస్తున్నారు.

గట్టు మల్లన్నపై సోదరులకు ప్రేమ ఎక్కువ..

మల్లికార్జునస్వామికి ఆరుగురు సోదరులు. ఐలోని మల్లన్న, కొమురవెల్లి మల్లన్న, ఓదెల మల్లన్న, దుబ్బ మల్లన్న, కట్ట మల్లన్న, గట్టు మల్లన్న. కాగా గట్టు మల్లన్న అందరికంటే చిన్నవాడు. చిన్నవాడైన గట్టు మల్లన్న అంటేనే అందరికి ప్రేమ ఎక్కువ అని చెప్పుకుంటారు. ఈ విషయాన్ని యాదవులు నాటి రాజుకు వివరించగా దేవుళ్ల వెలసిన చోట ఆలయం నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. ప్రతిరోజు పురోహితులు పూజలు చేస్తుండగా యాదవులు ఒగ్గు కథలు చెబుతూ పట్నాలు వేస్తున్నారు. గట్టు మల్లన్నను పూజిస్తే సకల కష్టాలూ దూరమౌతాయని, కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయన్న విశ్వాసంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం యాదవ, ఇతర కులాల ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేసి పూజలు చేయడం పరిపాటిగా మారింది. ఆది, బుధవారాల్లోనే కాకుండా శ్రావణ, కార్తీక మాసాల్లో ఆలయానికి భక్తులు తాకిడి ఎక్కువగా ఉంటోంది. అలాగే శివరాత్రి నుంచి ఉగాది వరకు గట్టు మల్లికార్జునస్వామి ఆలయం వద్ద పెద్ద ఎత్తున జాతర జరుగుతోంది.



గుట్టపైన ఉన్న ధర్మగుండం

ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తే..

గట్టు మల్లికార్జునస్వామి ఆలయం వద్ద గుట్టపై ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తే మేలు జరుగుతుందని ప్రజల్లో విశ్వాసం. గుండంలోని నీటిని తీసుకెళ్లి రైతులు పంట పొలాల్లో చల్లుకుంటారు. ఆలయ చుట్టు పక్కల గ్రామాల ఒగ్గు పూజారులు ఆలయంలో ప్రత్యేక పట్నాలు వేసి ఒగ్గు కథలతో మల్లన్న దేవున్ని కొలుస్తారు. ఆలయం ముందున్న గండదీపంలో నూనె పోస్తే గండాలు తప్పిపోతాయని అంటుంటారు. గతంలో శివరాత్రి నుంచి ఉగాది వరకు మాత్రమే పూజలు నిర్వహించడం ఆనవాయితీ కాగా 15 ఏళ్లుగా ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి. భక్తులు కూడా భారీగా తరలివస్తున్నారు.



దేవుడికి పూజలు చేస్తున్న అర్చకులు

వర్గీకరణ చేపట్టకుండా బీజేపీ మోసం



ధర్మసాగర్ : మాట్లాడుతున్న జన్ను దినేష్



భీమదేవరపల్లిలో..

ధర్మసాగర్ (వేలేరు) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ విమర్శించారు. మార్చి 15న తలపెట్టిన రాష్ట్ర రాజధాని దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన మాదిగ సంగ్రామ మండలానికి గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ మండల నాయకుడు కనకం రాజయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టగా దినేష్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లు గడచినా పార్లమెంటులో బిల్లు పెట్టలేదని, చట్టబద్ధత కల్పించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మాదిగ పేదలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 15న తలపెట్టిన హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజు, గంగారపు శ్రీనివాస్, గద్దల సుకుమార్, ఏలూరి కరుణాకర్, జిల్లెల పురుమయ్య, రామంచ ఏసు, బొడ్డు శాంతిసాగర్, అక్కల శంకర్, గోవిందు రవికుమార్, జోగు సారయ్య, జోగు మల్లయ్య, మోతె ఎల్లయ్య, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగ సంగ్రామ పాదయాత్ర మండలంలోని కొత్తకొండకు చేరుకోగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, నాయకులు గంగారపు శ్రీనివాస్, మాట్ల వెంకటస్వామి, రేణుకుంట్ల భిక్షపతి, బొడ్డు శాంతిసాగర్, శనిగరం రవీందర్, తాళ్లపల్లి మధుకర్, చుంచు రమేష్, మాడ్గుల మురళీ, కళ్యాణ్, రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) సరిత గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో ఎస్‌బీఐ సహకారంతో రూ.10 లక్షల విలువైన వాటర్ ప్యూరిఫయర్, టెలివిజన్, ట్యాబ్, ఐరన్ ర్యాక్స్, ప్రీ స్కూల్ మెటీరియల్, ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు సమకూర్చి అంగన్‌వాడీ కేంద్రానికి పెయింటింగ్ వేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, సీడీపీఓ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ అనిత పాల్గొన్నారు.

బోర్లు, బావులకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోండి



ఎల్కతుర్తి : వ్యవసాయ బోర్లు, బావుల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) వెంకటరమణ రైతులకు సూచించారు. మండలంలోని సూరారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం ప్రారంభమైన సందర్భంగా భూగర్భ జలాలను ఆదా చేసేందుకు రైతులు ఆటోమెటిక్ స్టాటర్లను తొలగించాలని సూచించారు. తద్వారా విద్యుత్తును, భూగర్భ జలాలను ఆదా చేయొచ్చని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా సంస్థకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం.. పోలీసులకు ఫిర్యాదు

శాయంపేట : మండలంలోని గట్లకనిపర్తి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో పంట పొలాలకు వెళ్లడానికి సీడీఎఫ్ నిధులతో చేపడుతున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసి శిలాఫలాకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామ రైతులు పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న క్రమంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు సర్పంచ్ సాంబయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి తీసుకెళ్లగా వారు స్పందించి సీడీఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయగా నిర్మాణ పనులకు ఈనెల 1న శిలాఫలాకాన్ని గండ్ర దంపతులు ఆవిష్కరించిన విషయం తెలిసిందే. గీత కార్మికులు తాటి వనానికి వెళ్తుండగా శిలాఫలకం ధ్వంసం అయిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసి సర్పంచ్ సాంబయ్య, ఉపసర్పంచ్ సురేష్, ఎంపీటీసీ బత్తిని రజిని సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు గుర్రం అశోక్, వార్డు సభ్యులు కరుణాకర్, సురేష్, కిరణ్, అశోక్ అక్కడకు చేరుకుని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.



ధ్వంసమైన శిలాఫకలం

ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం

శాయంపేట : ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి స్పష్టం చేశారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని సర్వేనెంబర్ 633లో ఆ పార్టీ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుని 50 రోజులు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం అర్ధ సెంచరీ ఉత్సవాలను నిర్వహించారు. పేదలు గుడిసెలను అందంగా అలంకరించి వంటా వార్పుతో పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. పేదలకు స్థలాలిచ్చి ఇళ్లు కట్టిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పార్టీ నేతృత్వంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ వెంటనే పట్టాలిచ్చి పక్కా ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు పట్టాలిప్పించే వరకు పార్టీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనుకారి అశోక్, బత్తిని సదానందం, మారెపల్లి క్రాంతికుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోట భిక్షపతి

అనాథాశ్రమానికి చేయూత

ఖిలా వరంగల్ : అనాథ పిల్లలు, వృద్ధులకు శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్, ఏకశిల చారిటబుల్ ట్రస్టు, విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో చేయూతనందించారు. విద్యార్థులతో కలిసి ఏకశిల డీజీ స్కూల్ శివనగర్ బ్రాంచి డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి కాశిబుగ్గలోని మదర్ థెరిస్సా మిషనరీస్ నిర్మల్ హృదయ్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, ఆశ్రమానికి కుర్చీలు, 20 కిలోల గోధుమ పిండిని అందజేశారు. కార్యక్రమంలో ఏకశిల డీజీ స్కూల్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల పరిశుభ్రతే ప్రభుత్వ లక్ష్యం

భీమదేవరపల్లి : పల్లెలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని ఎంపీపీ జక్కుల అనిత తెలిపారు. స్వచ్ఛ భారత్ రెండో దశ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా ఎంపీపీ మాట్లాడారు. పల్లెలను శుభ్రంగా ఉంచడానికి ప్రతిఒక్కరూ చొరవ చూపాలని సూచించారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. స్వచ్ఛ భారత్ రెండో దశ కార్యక్రమాల్లో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు. గ్రామాల్లో చెత్త సేకరణతోపాటుగా వ్యర్థాల నిర్వహణ సైతం సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖల ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, శిక్షకులు సంపత్, కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జక్కుల అనిత

నర్సరీల నిర్వహణలో జాగ్రత్త

దామెర : నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జగదీశ్వర్ కోరారు. మండలంలోని ఊరుగొండ నర్సరీని గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నర్సరీల్లోని అన్ని మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సంచుల్లో మొలకెత్తని వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్త విత్తనాలు విత్తాలని వనసేవకులకు సూచించారు. లక్ష్యాలను అనుగుణంగా హరిత హారం మొక్కలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శారద, కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ జగదీశ్వర్

'ఆరె కుల చీడపురుగు.. కిషన్‌రావు'



కమలాపూర్ : మాట్లాడుతున్న మోటె చిరంజీవి



ఆత్మకూరు : మాట్లాడుతున్న సాంబయ్య, హరీష్

కమలాపూర్ : ఆరె కులంలోని చీడపురుగుగా లింగంపల్లి కిషన్‌రావును ఆరె కుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి అభివర్ణించారు. ఆ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు హింగె రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిరంజీవి మాట్లాడారు. ఛత్రపతి శివాజీని దూషించడం, ఓబీసీ సర్టిఫికెట్ కోసం ఇబ్బంది పడుతున్న విద్యార్థులను తప్పుదోవ పట్టించడం, సంఘం కార్యక్రమాల్లో భాగస్వామ్యం కాకుండా నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం లాంటి తప్పుడు విధానాలు అవలంబిస్తున్నాడని ఆరోపించారు. కులస్తుల, ఓబీసీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ నేతృత్వంలోని కమిటీ ముందుకు సాగుతుందని చెప్పారు. సమావేశంలో వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి లడె శివకుమార్, నాయకులు వినయ్, దేవేందర్ పాల్గొన్నారు.

'లింగంపల్లి పద్ధతి మార్చుకోవాలి'

ఆత్మకూరు : లింగంపల్లి కిషన్‌రావు పద్ధతి మార్చుకోవాలని ఆరె కుల సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గువ్వాటి సాంబయ్య, లకిడె హరీష్‌రావు కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అదర్సాని చందర్‌రావు, ఉపాధ్యక్షుడు మోరె రాజు, సహాయ కార్యదర్శి సోలంక రవి, జిల్లా సహాయ కార్యదర్శి సిరిసె చందర్‌రావు, పెద్దాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యుగేందర్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీపై వ్యాఖ్యలు సరికాదు

హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన ఛత్రపతి శివాజీపై లింగంపల్లి కిషన్‌రావు హిందూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'సుపరిపాలన అందించడమే ధ్యేయం'

- నేడు చేరికలు : జన్నపురెడ్డి

భీమదేవరపల్లి : ప్రజల సుపరిపాలన అందించడమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ నేత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో నేడు (శుక్రవారం) పార్టీలో చేరనున్నారని ఆయన చెప్పారు. మండలంలోని ముల్కనూరు గ్రామంలోని బీజేపీ నాయకుడు ఊసకోయిల ప్రకాష్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా పార్టీ అధిష్టానం స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తోందని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 2వేల మంది ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరనున్నట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో కాషాయపు జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామి, నాయకులు ఉప్పుల కుమార్, గుండెల్లి సదానందం, ఊసకోయిల కిషన్, బొల్లంపల్లి శ్యాం, మాట్ల మొగిలి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి

సైలానీ బాబా గంధం ఉత్సవాలకు ఆహ్వానం

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గాలో మార్చి 12 నుంచి నిర్వహించనున్న గంధం ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి హనుమకొండలోని ఆయన నివాసంలో సైలానీ బాబా గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సైలానీ బాబా మాట్లాడారు. గంధం ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ ఎండీ.జాకీర్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు దారుప్పుల శంకర్, రఘుపతిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ జొజ్జం రమేష్, ఎస్‌కే.మొయినుద్దీన్ తదితరులున్నారు.



ఆహ్వానపత్రికను అందజేస్తున్న సైలానీ బాబా

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

శాయంపేట : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మైలారం గ్రామంలో మేకలకు, గొర్రెలకు పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ గురువారం నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని పశు పోషకులు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వీఎల్ఓ రమేష్‌బాబు, జేవీఓ సారంగం తదితరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ సునీల్

వ్యాసరచన పోటీలు

కేయూ క్యాంపస్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 25, 27వ తేదీల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య గురువారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన తాటికాయల నర్సమ్మ, బుర్ర రాములు అనారోగ్య కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలను డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత నర్సమ్మ, రాములు మృతదేహాలకు రవీందర్‌రావు నివాళులర్పించారు. రవీందర్‌రావు వెంట సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, నాయకులు తండా వెంకన్న, కొత్తూరి మధుకర్, పరమేష్ తదితరులున్నారు.